*RELEASED FROM*

***CPI(M) State Office***
H.No. 27-28-12, Yamalavari Street,
Governor Pet, Vijayawada -2
PH 0866 - 2577202, Fax : 0866-2577203.
E-mail: cpimap@gmail.com

# వామపక్ష పార్టీలు

**ప్రచురణార్థం/ప్రసారార్థం :**

**విజయవాడ,**
**తేది : 17 మే, 2022.**

## ప్రజా ఉద్యమాలపై రాష్ట్ర ప్రభుత్వ నిర్బంధాన్ని ఖండించండి

రాష్ట్రంలో ప్రజా సమస్యల పరిష్కారం కోసం జరుగుతున్న ఆందోళనలపై పెరుగుతున్న ప్రభుత్వ నిర్బంధం పట్ల 10 వామపక్ష పార్టీల సమావేశం ఆందోళన వ్యక్తం చేసింది. నిర్బంధ చర్యలను తక్షణమే మానుకోవాలని సమావేశం ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది.

రాష్ట్రంలో వివిధ తరగతుల ప్రజలు తమ న్యాయబద్ధమైన సమస్యలపై పలు రూపాల్లో ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ప్రత్యేకించి అసెంబ్లీ సమావేశాల సందర్భంగా ప్రభుత్వం దృష్టికి తమ సమస్యలను తీసుకు వచ్చేందుకు ధర్నాలు, దీక్షలు, ప్రదర్శనల రూపంలో కార్యక్రమాల నిర్వహణకు అనుమతులు కోరుతున్నారు. అయినా ఎవ్వరికీ అనుమతి ఇవ్వకుండా పోలీసు శాఖను ప్రభుత్వం నిర్దేశించడం గర్హనీయం. అనుమతులు ఇవ్వకపోగా ఆయా తరగతుల ప్రజల్ని, కార్యకర్తలపై వివిధ రూపాలలో నిర్బంధం ప్రయోగిస్తున్నది. వందలాది మంది మహిళలు, ఇతర కార్యకర్తలపై తప్పుడు కేసులు బనాయిస్తున్నారు.

సచివాలయ సిబ్బందిని ఉపయోగించి ఎక్కడికక్కడ గ్రామాలు, వార్డులలో నిఘా పెట్టడం, నోటీసులివ్వడం, పోలీస్ స్టేషన్‌లకు పిలిపించడం, గృహ నిర్బంధం చేస్తున్నారు. నిఘా పేరిట మహిళా టీచర్లతోపాటు పోలీసులు స్కూళ్ళకు వెళ్లడం, ఇళ్ల వద్ద ఫంక్షన్‌లు జరుగుతుంటే పోలీసులు వెళ్లడం తీవ్ర అభ్యంతరకరం. ఆయా సంఘాలలో సభ్యులుగా, కార్యకర్తలుగా ఉన్న వారినే కాకుండా వారి కుటుంబ సభ్యులను సైతం బెదిరిస్తూ మానసిక వ్యధకు గురిచేస్తున్నారు. ఈ విధంగా ఉద్యమాలను నిర్వీర్యం చేసేందుకు ప్రయత్నించడం అప్రజాస్వామికం.

ఇటీవల విజయవాడలో విద్యార్థి, మహిళా సంఘాలు నిర్వహించిన నిరసన కార్యక్రమాల పట్ల పోలీసులు వ్యవహరించిన తీరును సమావేశం ఖండిస్తున్నది.

నిర్బంధం ద్వారా ఉద్యమాలను, ప్రజల అసంతృప్తిని అణచాలనుకోవడం భ్రమే అవుతుంది. నిర్బంధ చర్యలు మానుకొని ఆయా తరగతుల ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం పూనుకోవాలి. అలా కాకుండా నిర్బంధ చర్యలు కొనసాగిస్తే తీవ్ర ప్రతిఘటనను ఎదుర్కోవలసి వస్తుంది.

ప్రభుత్వ నిర్బంధ చర్యలను నిరసించవలసిందిగా ప్రజలకు, ప్రజాతంత్రవాదులకు, మేధావులకు, సంఘాలు, సంస్థలకు సమావేశం విజ్ఞప్తి చేసింది.

### ఏలూరు జూట్ కార్మికోద్యమానికి మద్దతు

ఏలూరు శ్రీకృష్ణా జూట్ మిల్లు జనవరి 27 నుండి అక్రమ మూసివేతలో ఉంది. మిల్లు తెరవాలని కోరుతూ కార్మిక సంఘాల ఐక్య కార్యాచరణ ఆధ్వర్యంలో జరిగే ఉద్యమానికి వామపక్ష పార్టీలు సంఘీభావం ప్రకటిస్తున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం జోక్యం చేసుకుని మిల్లును తెరిపించి కార్మికుల జీవనోపాధి పరిరక్షణకు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తున్నాయి.

(వి.శ్రీనివాసరావు)
సిపిఐ(యం)

(కె.రామకృష్ణ)
సిపిఐ

(వై.సాంబశివరావు)
సిపిఐ(యంఎల్) న్యూడెమోక్రసీ

(జాస్తి కిషోర్‌బాబు)
సిపిఐ(యంఎల్)

(కాటం నాగభూషణం)
యంసిపిఐ(యు)

(యన్.మూర్తి)
సిపిఐ(యంఎల్) లిబరేషన్

(చిట్టిపాటి వెంకటేశ్వర్లు)
సిపిఐ(యంఎల్) న్యూడెమోక్రసీ

(బి.ఎస్. అమర్‌నాథ్)
యస్‌యుసిఐ(సి)

(పి.వి.సుందరరామరాజు)
ఫార్వర్డ్‌బ్లాక్

(జానకి రాములు)
రివల్యూషనరీ సోషలిస్టు పార్టీ